సాక్షి
రంగారెడ్డి
శనివారం । 28 । అక్టోబర్ । 2023



పేదల సంక్షేమానికే పెద్దపీట

పేదల సంక్షేమానికే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 2లో▸



ప్రజలే బీఆర్‌ఎస్‌కు బలం

ప్రజలే బీఆర్‌ఎస్‌కు బలమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు.2లో▸



ఓటేయండి.. రక్షణ కల్పిస్తాం

అసెంబ్లీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నంలో పోలీస్‌ కవాతు నిర్వహించారు. 2లో▸

న్యూస్‌రీల్‌

నేడు మైసిగండి మైసమ్మ ఆలయం మూసివేత



కడ్తాల్‌: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా శనివారం ఉదయం 11 గంటలకు మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గ్రహణం ముగిసిన అనంతరం 29న (ఆదివారం) ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం ఆలయాన్ని తిరిగి తెరవనున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించడం జరుగుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్‌: స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎల్‌.శ్రీవాచ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీజీటీ హిందీ, పీజీటీ జియాలజీ, కామర్స్‌ బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. టీజీటీ, హిందీ బోధించడానికి డిగ్రీ, హెచ్‌పీటీ, కామర్స్‌ బోధించడానికి టెట్‌, పీజీటీ కామర్స్‌కు ఎంకం, పీజీటీ జియోలజీ బోధించడానికి ఎమ్మెస్సీ, బీఈడీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు.

కోరం లేక జెడ్పీ సమావేశం వాయిదా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ అనితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పరిషత్‌ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ తీగల అనితారెడ్డి, సీఈఓ దిలీప్‌ కుమార్‌, ముగ్గురు జెడ్పీటీసీలు, నలుగురు ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. కోరం లేక పోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో మెజార్టీ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. నిర్దేశిత సమయం దాటి పోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు అనితారెడ్డి ప్రకటించారు.

యూత్‌ కాంగ్రెస్‌ మీడియా కో కన్వీనర్‌ నియామకం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ ప్రదేశ్‌ యూత్‌ కాంగ్రెస్‌ మీడియా సెల్‌ రాష్ట్ర జాయింట్‌ మీడియా కో కన్వీనర్‌గా కందుకూరు మండలానికి చెందిన కప్పాటి శివరామకృష్ణారెడ్డిని నియమిస్తున్నట్లు ఆలిండియా యూత్‌ కాంగ్రెస్‌ మీడియా సెల్‌ ఇన్‌చార్జి వరుణ్‌ పాండే ప్రకటించారు. ఈ మేరకు ప్రదేశ్‌ యూత్‌ కాంగ్రెస్‌ మీడియా సెల్‌ అధ్యక్షుడు సీహెచ్‌ శైలేంద్ర శుక్రవారం గాంధీభవన్‌లో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తనను ప్రదేశ్‌ యూత్‌ కాంగ్రెస్‌ మీడియా సెల్‌ జాయింట్‌ కన్వీనర్‌గా నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌ గాంధీ, సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.

నేడు చేవెళ్లలో కాంగ్రెస్‌ కార్నర్‌ మీటింగ్‌

చేవెళ్ల: మండలకేంద్రంలో శనివారం కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల ప్రచార కార్నర్‌ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్‌, పార్టీ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ప్రారంభించిన బస్సు యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు సభ ఉంటుందని తెలిపారు. సభకు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడి, పార్టీ రాష్ట్ర సీనియర్‌ నాయకులు, జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇక రేసులోకి..



కాంగ్రెస్‌ రెండో జాబితా విడుదల

- జిల్లాలో పూర్తయిన అభ్యర్థుల ప్రకటన
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం నుంచి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో హస్తం అభ్యర్థుల ఖరారు పూర్తయింది. తొలి జాబితాలో ముగ్గురి పేర్లను ప్రకటించిన అధిష్టానం తాజాగా శుక్రవారం ప్రకటించిన రెండో జాబితాలో మిగతా అభ్యర్థులను ఖరారు చేసింది. అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంపై ఆచితూచి వ్యవహరించినట్లు తెలుస్తోంది. అభ్యర్థుల బలాబలాలు, సర్వేల ఆధారంగా గెలుపు గుర్రాలకు ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం నుంచి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఎల్‌బీనగర్‌ స్థానానికి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌ను ప్రకటించింది. రాజేంద్రనగర్‌ స్థానానికి సంబంధించి ఆచితూచి వ్యవహరించింది. అక్కడి నుంచి మణికొండ మున్సిపల్‌ చైర్మన్‌ కస్తూరి నరేందర్‌ ముదిరాజ్‌ అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. ఇటీవల అధికార బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కూడా అధిష్టానం పెద్దపీట వేసింది. సీనియర్లు, పార్టీ విధేయులను సైతం పక్కకు పెట్టి బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్‌ వి.జగదీశ్వర్‌ గౌడ్‌కు శేరిలింగంపల్లి టికెట్‌ ఇచ్చింది. ఆయన అధికార బీఆర్‌ఎస్‌ నుంచి శేరిలింగంపల్లి టికెట్‌ ఆశించి భంగపడి తన భార్య కార్పొరేటర్‌ పూజితతో కలిసి కాంగ్రెస్‌లో చేరిన విషయం విధితమే. జగదీశ్వర్‌ గౌడ్‌కు ఈ నియోజకవర్గంలో గట్టి పట్టుంది.

మహేశ్వరం నియోజకవర్గం

అభ్యర్థి:	కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి
పుట్టిన తేదీ:	24-04-1956
తల్లిదండ్రులు:	రామలక్ష్మమ్మ, కొండారెడ్డి
భార్య:	విజయలక్ష్మి
పిల్లలు:	అనురూప్‌, అభిషేక్‌
స్వగ్రామం:	మాసానిగూడ, శంకర్‌పల్లి మండలం
విద్యార్హత:	ఎమ్మెస్సీ

రాజకీయ నేపథ్యం: 1999లో చేవెళ్ల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్‌ అభ్యర్థి ఇంద్రారెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. 2000 ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి బరిలో దిగి కాంగ్రెస్‌ అభ్యర్థి సబితారెడ్డిపై పోటీ చేసి ఓటమిచెందారు. 2009లో మేడ్చల్‌ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి నక్కా ప్రభాకర్‌గౌడ్‌పై విజయం సాధించారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం

అభ్యర్థి:	మల్‌రెడ్డి రంగారెడ్డి
పుట్టిన తేదీ:	01-10-1958
తల్లిదండ్రులు:	మల్‌రెడ్డి రాములమ్మ, బాల్‌రెడ్డి
భార్య:	అనసూయరెడ్డి
పిల్లలు:	నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు
స్వగ్రామం:	తొర్రూర్‌, అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం
విద్యార్హత:	డిగ్రీ

రాజకీయ నేపథ్యం: 1981లో తొర్రూర్‌ సర్పంచ్‌గా రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టి 1987 వరకు కొనసాగారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. తుర్కయంజాల్‌ రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా, మలక్‌పేట వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మలక్‌పేట టీడీపీ ఎమ్మెల్యేగా 1994-1999 వరకు, కాంగ్రెస్‌ ఎమ్మెల్యేగా 2004-2009 వరకు కొనసాగారు. 2009లో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోగా, 2018లో మరోసారి ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు అవకాశం దక్కకపోవడంతో బీఎస్పీ నుంచి బరిలోకి దిగి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రస్తుతం టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఆధారాలతో వస్తే తిరిగిస్తాం

ఎన్నికల వేళ రూ.21.26 కోట్ల నగదు స్వాధీనం

- 59.19 కిలోల బంగారం.. 5.82 కిలోల సిల్వర్‌ సీజ్‌
- జిల్లావ్యాప్తంగా 350 కేసులు నమోదు
- 'సాక్షి'తో జిల్లా ఎలక్షన్‌ గ్రీవెన్స్‌ కమిటీ చైర్మన్‌ దిలీప్‌ కుమార్‌



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఎన్నికల నేపథ్యంలో పోలీసులు సీజ్‌ చేస్తున్న మద్యం, నగదు, బంగారు ఆభరణాల్లో రాజకీయ నాయకులవే కాకుండా సామాన్యులవి కూడా ఉంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రి బిల్లుల చెల్లింపు కోసం తీసుకెళ్లే నగదు సహా, శుభకార్యాల నేపథ్యంలో వస్త్రాభరణాల కొనుగోలు కోసం వెంట తీసుకెళ్లే నగదు కూడా ఉంటోంది. ఇలాంటి వారు తగిన ఆధారాలతో తమను సంప్రదిస్తే.. వెంటనే వాటిని అధికారుల చెర నుంచి విడిపిస్తాం' అని జిల్లా ఎన్నికల గ్రీవెన్స్‌ కమిటీ చైర్మన్‌, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్‌ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తనిఖీలు ముమ్మరం

ఎన్నికల కోడ్‌ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలుపొందాలనే ఉద్దేశంతో కొంత మంది అభ్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఓటర్లకు మద్యంతో పాటు నగదు, బంగారం, ఇతర వస్తువులను ఆశ చూపుతున్నారు. గుట్టుగా వాటిని వారికి చేరవేస్తున్నారు. అభ్యర్థులు, వారి బంధువులు, ముఖ్య అనుచరులు ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్న నగదు సహా మద్యం, ఇతర విలువైన వస్తువులను పోలీసులు గుర్తించి, ఎప్పటికప్పుడు సీజ్‌ చేస్తున్నారు. ఇలా సీజ్‌ చేసిన మొత్తంలో సామన్యులకు సంబంధించిన నగదు కూడా ఉంటోంది. వారి రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా ఎన్నికల కమిషన్‌ జిల్లాల వారిగా గ్రీవెన్స్‌ కమిటీలను ఏర్పాటు చేసింది. తగిన ఆధారాలతో గ్రీవెన్స్‌ సెల్‌కు వచ్చిన వారికి తిరిగి వారి నగదు అందజేస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 350 కేసులు నమోదయ్యాయి. రూ.21.26 కోట్ల నగదు పట్టుబడింది. 59.19 కిలోల బంగారం, 5.82 కిలోల సిల్వర్‌, ఒక లోడు చీరల లారీ పట్టుబడింది. 260 ఫోన్లు సీజ్‌ చేశాం. వీరిలో ఇప్పటి వరకు 162 మంది అప్పీల్‌కు వచ్చారు. 70 కేసులను పరిష్కరించి, రూ.2.31 కోట్ల నగదు వారికి రిటర్న్‌ చేశాం.

గడువు ముగిసాక ప్రభుత్వానికి..

సాధారణంగా ఎవరైనా నగదు సీజ్‌ చేసిన వెంటనే అప్పీల్‌కు వచ్చి.. సీజ్‌ చేసిన మొత్తానికి తగిన ఆధారాలు చూపించి, ట్రెజరీ నుంచి నగదును విడిపించుకుపోతుంటారు. జిల్లాలో ఇప్పటి వరకు సీజ్‌ చేసిన కేసుల్లో 92 కేసులు గ్రీవెన్స్‌ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అప్పీల్‌కు 60 రోజుల గడువు ఉంటుంది. పట్టు బడిన డబ్బును ఎలా విడిపించుకోవాలో తెలియక కొంత మంది.. ఆధారాలు లేక మరికొంత మంది ఇందుకు వెనుకాడుతున్నారు. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత పట్టుబడిన నగదు సహా బంగారు ఆభరణాలను ప్రభుత్వానికి అప్పగిస్తాం. ఈ తరహా కేసులు ప్రస్తుతమే కాదు..గతంలోనూ భారీగానే నమోదయ్యాయి. పట్టు బడిన నగదును విడిపించుకునేందుకు బ్యాంకు స్టేట్‌మెంట్‌ లేదా ఏదైనా ఆస్తి క్రయ విక్రయాలకు సంబంధించిన దస్తావేజులు, అగ్రిమెంట్‌ పేపర్లు వెంట తీసుకొచ్చి జిల్లా ట్రెజరీలో జమ చేసిన నగదు, వస్తువులను విడిపించుకోవాలి. పట్టుబడిన దానిలో ఒక వేళ బంగారం, ఇతర వస్తువులేమైనా ఉంటే..వాటిని కొనుగోలు చేసిన షాపు నుంచి రసీదు తేవాలి.

రూ.పది లక్షలు దాటితే ఐటీకే..

ఎన్నికల కోడ్‌ అమల్లో ఉండటంతో పోలీసులు రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లే వారిని గుర్తించి, ఆ మొత్తాన్ని సీజ్‌ చేస్తున్న విషయం తెలిసిందే. రూ.10 లక్షల లోపు నగదును జిల్లా గ్రీవెన్స్‌ కమిటీ వద్దే రిలీజ్‌ చేసుకోవచ్చు. అంతకు మించితే..ఆ మొత్తాన్ని ఐటీ నోడల్‌ ఆఫీసర్‌కు సిఫార్సు చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ.పది లక్షలు దాటిన 9 కేసులను ఐటీ నోడల్‌ ఆఫీసర్‌కు సిఫార్సు చేశాం. ఆదాయ పన్ను చెల్లింపు వారు అన్ని వివరాలు సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఆ మొత్తాన్ని వారు విడుదల చేస్తున్నారు. లిక్కర్‌తో పాటు సేల్స్‌కు సంబంధించిన నగదు కూడా ఈ తనిఖీల్లో భారీగా పట్టుబడుతోంది. లిక్కర్‌ సేల్స్‌ లాగ్‌బుక్స్‌ను పరిశీలించి, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే అంశంపై ఓ నిర్ధారణకు రానున్నాం. ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌ఓ సర్టిఫైడ్‌ చే సిన తర్వాతే వాటిని రిలీజ్‌ చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు ఏడు నుంచి ఎనిమిది కేసులు నమోదయ్యాయి. ఇక బంగారు ఆభరణాల దుకాణాలకు సంబంధించిన కేసులు కూడా నమోదయ్యాయి. త గిన ఆధారాలు చూపిస్తే..వాటిని విడుదల చేస్తాం. లేదంటే ప్రభుత్వానికి అప్పగిస్తాం.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కేసీఆర్‌తో మ్యాచయ్యే లీడరే లేడు

- ఆయనకు పనితనం తప్ప పగ లేదు
- అలా ఉంటే ఓటుకు నోటు కేసులో దొరికిన వారు బయట తిరిగేవారు కాదు
- కాంగ్రెస్‌ అంటేనే మాటలు, మూటలు, మంటలు
- ఎమ్మెల్యేగా గెలవలేని వారంతా సీఎంలు అవుతారంట
- మన్నెగూడ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

తుర్కయంజాల్‌: ప్రతిపక్షాల్లో కేసీఆర్‌తో మ్యాచయ్యే లీడరే లేడని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆయనకు పనితనం తప్ప, పగతనం లేదని పేర్కొన్నారు. ఉంటే , ఎన్నో స్కాములు చేసిన ప్రతిపక్షాల నాయకులు అంతా జైలులోనే ఉండేవారు, ఓటుకు నోటు కేసులో పట్టపగలు దొరికిన వారు బయట తిరిగే వారా..? అని ప్రశ్నించారు. మన్నెగూడలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బూత్‌ కమిటీ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాసంగి సాగు కోసం రైతుబంధు నిధులను విడుదల చేయొద్దని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తాము రైతుబంధు నిధుల విడుదలకు వ్యతిరేకం కాదని బుకాయిస్తున్నాడన్నారు. రైతుబంధు ఏమైనా కొత్త పథకమా..? ఇప్పటికే 11సార్లు ఇచ్చాం. ఆ పార్టీ అధ్యక్షుడు ఇప్పటికే వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలు అనే మాటలన్న విషయం ప్రజలు మరువకూడదని గుర్తుచేశారు. మరో 3వేల కోట్లు నిధుల విడుదల చేస్తే రుణమాఫీ అందరికీ అందినట్లేనని, దీనిపై ఎన్నికల కమిషన్‌ అనుమతి కోరుతున్నామని, అనుమతి వస్తే వెంటనే నిధులు విడుదలవుతాయని, ఒక వేళ రాక పోతే నెల తర్వాత మూడోసారి అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీని అమలు చేస్తామని రైతులకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్‌ పార్టీలో అన్నదమ్ముళ్లకే పడదని, ఒకరి కాళ్లు పట్టి మరొకరు లాక్కుంటారని, అది ఎండ్రికాయ లాంటి పార్టీ అని ఎద్దేవా చేశారు. ఒకరేమో ఎన్నికల్లో పోటీనే చేయడం లేదు అయినా నేను సీఎం అవుతానని అంటున్నాడని, సంగారెడ్డి అభ్యర్థి జగ్గారెడ్డి ఎన్నికల్లో గెలిచే పరిస్థితులే లేవని ఆయన కూడా నేనే సీఎం అంటున్నాడని, మరొకరైతే సీఎం అయిపోయి మంత్రి పదవుల పంపకాలే చేపడుతున్నట్లు మాట్లాడుతుంటం చూస్తుంటే ఆ పార్టీలో ఎంత మంది సీఎం అభ్యర్థులు ఉన్నారో ప్రజలే గమనించాలన్నారు. కాంగ్రెస్‌ అంటేనే మాటలు, మూటలు, మంటలు అని, 2018 ఎన్నికల్లోనూ టీడీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌ కలిసి పోటీ చేసి ఇంతకంటే ఎక్కువ బిల్డప్‌ ఇచ్చారని, ఎన్నికల్లో ప్రజలు ఈడ్చి కొడితే బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రోళ్ల కాళ్లు ఒత్తుకుంటూ కూర్చున్న రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఏర్పాటు కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా పారిపోయిన బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి.. కేసీఆర్‌తో పోటీనా అని ప్రశ్నించారు. బూత్‌ కమిటీ సభ్యులు 33 రోజుల పాటు కష్టించి పనిచేసి , బీఆర్‌ఎస్‌ పార్టీ గెలుపునకు కృషి చేయాలని, ప్రతి పక్షాల కుట్రలను తిప్పి కొడుతూ, మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అంతా సమన్వయంతో పని చేసి ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ సత్తు వెంకటరమణారెడ్డి, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ కొత్తకుర్మ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్‌తో పాటు పెద్ద ఎత్తున బూత్‌ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భారీగా నగదు పట్టివేత

షాబాద్‌: పోలీసుల వాహనాల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతోంది. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్‌ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అభిషేక్‌ అనే వ్యక్తి దగ్గర రూ. 4 లక్షలు, శంకర్‌ అనే వ్యక్తి వద్ద రూ. 6లక్షల నగదు దొరికినట్లు పోలీసులు తెలిపారు. వీటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మొత్తం రూ. 10లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రూ.1.05 లక్షల నగదు సీజ్‌

పహాడీషరీఫ్‌: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.05 లక్షల నగదును బాలాపూర్‌ పోలీసులు సీజ్‌ చేశారు. ఇన్‌స్పెక్టర్‌ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు..బండ్లగూడ మహ్మద్‌నగర్‌కు చెందిన మహ్మద్‌ ఆబేద్‌ అన్సారీ(45) శుక్రవారం కారులో రూ. 1.05 లక్షల నగదు తరలిస్తున్నాడు. ఎర్రకుంట చెక్‌పోస్ట్‌ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు కారులో సోదాలు చేయగా నగదు లభ్యమైంది.ఎలాంటి ఆధారాలు చూపని కారణంగా నగదును మహేశ్వరం ఆర్‌వోకు అందజేసినట్లు తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ.7లక్షలు స్వాధీనం

కొత్తూరు: ఎన్నికల సందర్భంగా పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి శుక్రవారం రూ.7లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జేపీదర్గా కూడలిలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా నందిగామ మండలం రంగాపూర్‌ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌శాస్త్రి తన స్కూటీలో రూ.7లక్షలు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి ఆయన వద్ద ఎలాంటి రసీదులు, పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.



కొత్తూరు: స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ

ప్రాణం తీసిన మటన్‌ ముక్క

గొంతులో ఇరుక్కుని బాలుడి మృతి

షాద్‌నగర్‌ రూరల్‌: మటన్‌ ముక్క గొంతులో ఇరుక్కుని బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌ జిల్లా బాలానగర్‌ మండలం మామిడిగుట్ట తండాకు చెందిన లక్ష్మణ్‌ కుమారుడు మున్నా (13) గురువారం ఇంట్లో మటన్‌తో భోజనం చేస్తుండగా గొంతులో ముక్క ఇరుక్కుంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మరణించినట్లు వైద్యులు తేల్చారు. అనంతరం గొంతులోని మటన్‌ ముక్కను తొలగించారు.

రెడీ టు రేసింగ్‌

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే నెలలో జరగనున్న ఇండియన్‌ రేసింగ్‌ లీగ్‌ పోటీలకు నగరం మరోసారి ఆతిథ్యమివ్వనుంది. ఇండియన్‌ రేసింగ్‌ లీగ్‌ అనంతరం వచ్చే ఫిబ్రవరిలో ఫార్ములా- ఈ పోటీలు జరగనున్నాయి. ఈ క్రమంలో నవంబర్‌ 4, 5 తేదీల్లో నిర్వహించనున్న ఇండియన్‌ మోటార్‌ రేసింగ్‌ లీగ్‌ కోసం హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు చేపట్టింది. నెక్లెస్‌రోడ్డులోని స్ట్రీట్‌ సర్క్యూట్‌ పునరుద్ధరణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. రోడ్డు డివైడర్లు, బారికేడ్లు, ఎత్తైన కంచెలను తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. మరో నాలుగైదు రోజు ల్లో అన్ని పనులను పూర్తి చేసి నవంబర్‌ నాటి కి రేసింగ్‌ నిర్వహణకు సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే ట్రాక్‌పై ఫిబ్రవరి 10న ఫార్ములా-ఈ పోటీలు జరుగుతాయి. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఎలాంటి లోపాలకు తావు లేకుండా ట్రాక్‌ పునరుద్ధరణ చేపట్టారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

- కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని కాంగ్రెస్‌ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తన నివాసంలో మద్దతుదారులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరాక నియోజకవర్గంలో తనకు వస్తున్న ప్రజాదరణను చూసి కొందరు ఓర్వలేకనే తనపై కుట్రతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ద్వారా పార్టీ నుంచి సస్పెండ్‌ చేయించారని ఆరోపించారు. ప్రజాభిమానం ఉన్న తను స్వతంత్ర అభ్యర్థిగానే బరిలో ఉంటానని, గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి 60 గజాల ఇంటి స్థలం, అర్హులైన వారికి తక్కువ ధరకే గ్యాస్‌సిలిండర్‌, పేదింటి వివాహాలకు పుస్తె, మెట్టెలు, విలువైన గృహోపకరణాలు అందజేస్తానని, గెలిచాక ఒక్క రూపాయి జీతం తీసుకోకుండా ప్రజల కోసమే ఖర్చు చేస్తానన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని చెరువులన్నింటిని సంరక్షించి అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. కెఎంఆర్‌ ట్రస్టు ద్వారా సొంతంగా పేదలకు ఇళ్ల స్థలాలు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ, జాబ్‌మేళాలు, బ్యూటీషియన్‌ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశానన్నారు. స్థానికుడినైన తనకు ఓటు వేసి గెలిపిస్తే మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నెరవేరుస్తానని మనోహర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సంతోష్‌కుమార్‌ ముదిరాజ్‌, నర్సింగ్‌, లింగమయ్య, రాజు, శంకరయ్య, కార్తీక్‌రెడ్డి, సురేష్‌, శ్రీనివాస్‌, మధు, భాస్కర్‌, రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మేనిఫెస్టో విడుదల చేస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

రేవంత్‌రెడ్డిని ఓడిస్తా..

మహేశ్వరంతో పాటు కొడంగల్‌ స్థానం నుంచి రేవంత్‌రెడ్డిపై పోటీ చేసి చిత్తు చిత్తుగా ఓడిస్తానని మనోహర్‌రెడ్డి శపథం చేశారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌ త్వరలోనే జైలుకు వెళతారని జోస్యం చెప్పారు.

అధికారం రాగానే 'ఆరు గ్యారెంటీ'



మొయినాబాద్‌రూరల్: మాట్లాడుతున్న భీమ్ భరత్

కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి భీమ్ భరత్

మొయినాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పెట్టిన పథకాలన్నీ గ్యారెంటీగా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భీమ్ భరత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ.. పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయని బీఆర్‌ఎస్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను కాపీకొట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నా బలం.. బలగం మీరే.. కంఠంలో ప్రాణమున్నంత వరకు ప్రజాసేవకే అంకితమన్నారు. అధికార బీఆర్‌ఎస్ ఎన్ని ఇబ్బందులు పెడుతున్నా నాటి నుంచి పార్టీని కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో నేటికీ డబుల్ బెడ్రూం ఇళ్ల జాడే లేదన్నారు. అనంతరం సతీశ్, దర్శన్ మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ అమలుకు ముందే సంక్షేమ పథకాలు విడుదల చేయాలంటే అధికార పార్టీ మాత్రం దాన్ని వక్రీకరించి ప్రచారం చేసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో భీమ్‌భరత్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని సోనియాగాంధీకి బహుమతిగా ఇద్దామన్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్రారెడ్డి, కేబుల్ రాజు, గణేశ్ గౌడ్, మక్బుల్, రాజేందర్, రమేశ్, మల్లారెడ్డి, రాంరెడ్డి, ఆంజనేయులుగౌడ్, మహేందర్ ముదిరాజ్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

శంకర్‌పల్లి: తన భర్తను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గ అభివృద్ధి చేసి చూపిస్తాడని భీమ్‌భరత్ సతీమణి జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని రావులపల్లి కలాన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతుందన్నారు. నగరానికి ఆనుకుని ఉన్న చేవెళ్ల పదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రావులపల్లి కలాన్ అధ్యక్షుడు సురేందర్, వార్డు సభ్యులు మన్నె శ్రీనివాస్, బి.వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, అంజద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రావులపల్లి కలాన్‌లో ప్రచారం చేస్తున్న జ్యోతి

పేదల సంక్షేమానికే పెద్దపీట

- ప్రతిపక్షాలపై ప్రజలకు నమ్మకం లేదు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: పేదల సంక్షేమానికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నకర్తమేడిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు పలువు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన ఆయన పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో పార్టీ ప్రజలకు దగ్గరైందని అందుకే వారు బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మడం లేదన్నారు. తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాషా, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శివలీల తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కారుకు ఓటేసి ఆశీర్వదించండి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేశానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని వింటేజ్ హోమ్స్‌లో పలు కాలనీల్లో ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చానని గుర్తు చేశారు. మరో సారి కారు గుర్తుకు ఓటేసి తనను నాలుగోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, కౌన్సిలర్లు కీర్తన, భాగ్యమ్మ, నాయకులు లక్ష్మారెడ్డి, కృష్ణ, శంకర్, చిన్నయ్య పాల్గొన్నారు.

షాద్‌నగర్ అడిగితే పాలమూరు ఖరారు

- తండ్రి దరఖాస్తు చేసుకున్న స్థానంలో తనయుడికి చోటు
- బీజేపీ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి ఏపీ మిథున్‌రెడ్డికి అవకాశం
- అయోమయంలో అనుచరులు

షాద్‌నగర్: అనుకున్నది ఒక్కటి.. అయినది ఒక్కటి అన్న చందంగా మారింది బీజేపీ యువనేత పరిస్థితి.. మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి షాద్‌నగర్ అసెంబ్లీ బరిలో నిలిచేందుకు తీవ్రంగా యత్నించారు. అనూహ్యంగా అధిష్టానం శుక్రవారం విడుదల చేసిన రెండో లిస్టులో ఒకే ఒక్కడికి పాలమూరు టికెట్ కేటాయించి ప్రకటించింది.

షాద్‌నగర్ అడిగితే పాలమూరు

కొన్ని ఏళ్ల నుంచి ఏపీ మిథున్‌రెడ్డి షాద్‌నగర్‌లో చురుగ్గా పనిచేస్తూ కేడర్ పెంచుకున్నారు. స్థానికుడు కాదనే ఆరోపణలు రావడంతో స్థానికంగా ఇంటిని నిర్మించుకుని ప్రజలతో మమేకమయ్యారు. మహబూబ్‌నగర్ స్థానానికి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, షాద్‌నగర్ నుంచి పోటీ చేసేందుకు మిథున్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. కా గా బీజేపీ అధిష్టానం మాత్రం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి ఏపీ మిథున్‌రెడ్డిని పేరు ప్రకటించింది. దీంతో షాద్‌నగర్ పార్టీ కేడర్‌లో ఒక్కసారిగా సమీకరణాలు మారిపోయాయి. ఏపీ మిథున్‌రెడ్డికి అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. ఇన్నాళ్లు ఆయన వెంట తిరిగిన నేతలు ఎవరికి మద్దతివ్వాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. టికెట్ రేసులో ఉన్న మిగిలిన నేతలను కాదని మిథున్‌రెడ్డి వెంట వెళ్లిన నేతల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.



మిథున్‌రెడ్డి

టికెట్ కోసం త్రిముఖ పోరు

బీజేపీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు నలుగురు నేతలు పోటీ పడ్డారు. పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డిలు అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా శ్రమించగా అధిష్టానం మిథున్‌రెడ్డికి మహబూబ్‌నగర్ అసెంబ్లీ కేటాయించారు. దీంతో ప్రస్తుతం ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. అందులో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పార్టీ పెద్దలు షాద్‌నగర్ అసెంబ్లీ బీజేపీ ఎవరికి టికెట్ కేటాయిస్తారో దాని పై ఉత్కంఠ నెలకొంది.

గొర్రెల మందపై కుక్కల దాడి

20 జీవాలు మృత్యువాత



గొర్రెల కళేబరాల వద్ద కాపరి

మొయినాబాద్‌రూరల్: గొర్రెల మందపై వీధికుక్కలు దాడి చేయడంతో 20 జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని నక్కలపల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు గుత్తి గోపాల్ తన ఇంటి సమీపంలో గొర్రెల మంద ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం రాత్రి సుమారు పది వీధి కుక్కలు మందలో చొరబడి గొర్రెలపై దాడి చేయడంతో అవి మృత్యువాత పడ్డాయని బాధితుడు బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ స్వప్నగౌడ్, గ్రామస్తులు నిరంజన్‌గౌడ్ తదితరులు బాధితుడిని పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కారు టైరు పేలి..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: కారుటైరు పేలి ఓ సాఫ్ట్‌వేర్ దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన శుక్రవారం సాయంత్రం ఓఆర్‌ఆర్‌పై చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. మండల మరళీకృష్ణ ప్రసాద్‌రావు సాఫ్ట్‌వేర్. ఆయన తండ్రి, భార్య, కుమారుడితో కలిసి తన కారులో ఓఆర్‌ఆర్ మీదుగా చందానగర్‌కు వెళ్తున్నారు. బొంగ్లూర్ ఎగ్జిట్ 12కి సమీపంలో కారు టైరు పేలడంతో కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మురళీకృష్ణ ప్రసాద్‌రావు (51) అక్కడికక్కడే మరణించాడు. మిగిలిన వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజలే బీఆర్‌ఎస్‌కు బలం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఊరేళ్ల, మొండివాగు, దేవునిఎర్రవల్లిలో ప్రచారం

చేవెళ్ల: ప్రజలే బీఆర్‌ఎస్‌కు బలమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఊరేళ్ల, మొండివాగు, దేవునిఎర్రవల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. గతంలో జరిగిన అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన పనులను ప్రజలు గుర్తించాలన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు మంగళ హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ .. చేవెళ్ల హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా తన గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.మాలతి, వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, సర్పంచ్‌లు సామ మానిక్యరెడ్డి, జహంగీర్, వెంకటేశం గుప్తా, మోహన్‌రెడ్డి, భీమయ్య, మల్లారెడ్డి, నరహరిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, మాజీ ఎంపీపీ బాలరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి నరేందర్, పార్టీ నాయకులు ఎం.మానిక్యరెడ్డి, రంగారెడ్డి, యాదిరెడ్డి, కుంచం శివకుమార్, డీఎం చందు, ప్రభాకర్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, తోట చంద్రశేఖర్, జంగయ్య, రాంచంద్రయ్య, రంగారెడ్డి, మల్లేశ్, నాగార్జున్‌రెడ్డి, నర్సింలు, గని, అంజయ్య, నరేందర్, సత్తి, యాదగిరి, చింటూ, జైపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విఠలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



దేవునిఎర్రవల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

అభివృద్ధిని చూసే చేరికలు

మొయినాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఇతర పార్టీల కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, అప్పోజీగూడ గ్రామాల్లోని ఇతర పార్టీలకు చెందిన యువకులు శుక్రవారం ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఎమ్మెల్యే యాదయ్య వారికి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీలో చేరినవారిలో కుమార్, నర్సింహ, రాజేశ్, మహేందర్, రాజు, పాండు, యాదయ్య, గోపాల్, కన్న, శ్రావణ్‌కుమార్, గోపాల్, శ్రీకాంత్, రమేశ్, సుమన్, సిద్ధు, సంజు, బాలు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, రాంచందర్, నరేశ్ తదితరులు ఉన్నారు.

రూ.50కి అశ్లీల వీడియో!

- ట్విట్టర్ ద్వారా విక్రయిస్తున్న వ్యక్తి

సాక్షి, సిటీబ్యూరో: ఓ బాలికకు చెందిన మార్ఫింగ్ అశ్లీల వీడియోను ట్విట్టర్ ద్వారా వైరల్ చేస్తూ, రూ.50కి విక్రయిస్తున్న వ్యక్తిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగర షీ-టీమ్స్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, ఈ తరహా వీడియోలు కలిగిన ట్విట్టర్ వినియోగదారులను మందలించామని డీసీపీ కవిత శుక్రవారం పేర్కొన్నారు. భూక్యా రమేశ్‌కి ట్విట్టర్‌లో అకౌంట్ ఉంది. ఇతగాడు మార్ఫింగ్ ద్వారా రూపొందించిన ఓ బాలికకు చెందిన అశ్లీల వీడియోను వైరల్ చేస్తున్నాడు. పలువురు ట్విట్టర్ ఖాతాదారులను సంప్రదించి రూ.50 వసూలు చేస్తూ ఆ వీడియో వారికి షేర్ చేస్తున్నాడు. ఈ విషయం గుర్తించిన సిటీ షీ-టీమ్స్ అధికారులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ పోలీసులు సాంకేతిక ఆధా

అరవై ఏళ్లలో అభివృద్ధి శూన్యం

- పదేళ్లలో చేసి చూపించాం
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అరవై ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల, చిల్కమర్రి, విఠ్యాల, పుల్చర్లకుంటతండా, కంసాన్‌పల్లి, గిరాయిగుట్ట తండా, వెంకటరెడ్డిపల్లి, భీమారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. పదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజలను మభ్య పెట్టేందుకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నాలుగువేల కోట్ల అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని కొనసాగించాలంటే ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడాలన్నారు.



బూర్గులలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఓటేయండి.. రక్షణ కల్పిస్తాం

పట్నంలో పోలీస్ కవాతు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నంలో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, పాత బస్టాండ్, యాదవ బస్తీ, బృందావన్ కాలనీల మీదుగా ఈ కవాతు సాగింది. మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేఎస్ రావు, సీఐ గోవింద్ రెడ్డి, మంచాల సీఐ కాశీవిశ్వనాథ్‌లు ఈ ర్యాలీని పర్యవేక్షించారు. భయాందోళనలకు తావులేకుండా.. ప్రలోభాలకు లోనవ్వకుండా సుపరిపాలకులను ఎన్నుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు కలిగించినా తమకు సమాచారం ఇవ్వాలని చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మైబెల్లి, మారయ్య, రామకృష్ణ, కృష్ణారెడ్డి, సెంట్రల్ ఇండస్ట్రియల్ స్పెషల్ ఫోర్స్, ఏఆర్ ఫోర్స్, స్పెషల్ పార్టీ ఫోర్స్‌లు సుమారు 170 మంది పోలీసులు ఈ కవాతులో పాల్గొన్నారు.

